క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



మరికల్: మండల తహసీల్దార్‌గా కొత్తగా వచ్చిన అనిల్‌కుమార్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు రామేశ్వర్‌రెడ్డితో పాటు అధికారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్, మైక్‌సెట్ వితరణ



మాగనూర్: మండలంలోని అమ్మపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మాజీ ఉప సర్పంచ్ పద్మ రూ.12 వేల స్పీకర్, మైక్‌సెట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడారు. పాఠశాలకు మైక్‌సెట్, స్పీకర్ వితరణ చేసిన దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆలంపల్లిలో లబ్ధిదారులకు పత్రాల పంపిణీ

కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జానయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు 297 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 172మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రైతు ఆత్మీయ భరోసాకు మొత్తం 45మందిలో 6మందికి ఎంపిక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డుల కోసం 265 మంది దరఖాస్తులు చేసుకోగా, 72 మందికి మంజూరు పత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఊట్కూరు: మండలంలోని కొల్లూరులో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గణతంత్ర్య దినోత్సవం రోజు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ, తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రేషన్‌కార్డులు 30, ఇందిరమ్మ ఇళ్లకు 116, రైతు భరోసాకు 1021, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 7 అర్హులైన లబ్ధిదారులున్నారని, వారికి ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు సమావేశం నిర్వహించి సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు



మాగనూర్: ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం రాష్ట్ర మహాసభలకు మాగనూర్ మండలం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతుందన్నారు. వెళ్లిన వారిలో భరత్‌కుమార్, వెంకటయ్య, ఎస్.ఆంజనేయులు, బాలు, నర్సింహ, నయూం, గోవింద్, కాసీం, శివరాజ్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

దామరగిద్ద: సీపీఎం రాష్ట్ర మహాసభలకు మండల సీపీఎం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు గోపాల్, మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్, శివకుమార్, జోషి, షేర్‌ఖాన్, మోహన్ దామోదర్, అశోక్, అంజప్ప, నర్సింహులు, నారాయణ, గోవింద్, ఉన్నారు.

చెన్వార్‌లో పశువైద్య శిబిరం

మద్దూరు: మండలంలోని చెన్వార్‌లో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 23 గేదెలు, 9 ఆవులకు గర్భకోశ, చూడి వ్యాధి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పాల దిగుబడి ఎక్కువ పొందుతున్న రైతులు శంకర్, మహిపాల్‌రెడ్డిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య డాక్టర్లు విశాల, సబిత, వీఏ అరుణ, గోపాల్ మిత్రల సూపర్‌వైజర్ విజయ్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.





నర్వలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ధన్వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- విద్యార్థులు, అధికారుల ర్యాలీలు, ప్రతిజ్ఞ, మానవహారం

సాక్షి, నెట్‌వర్క్: నారాయణపేట జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నారాయణపేట వీధులలో ర్యాలీ నిర్వహించి ఓటుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

- పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సిబ్బంది, డ్రైవర్ కండక్టర్ లతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ లావణ్య మాట్లాడారు.
- మరికల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు విద్యార్థులతో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేశారు.
- కొత్తపల్లిలో విద్యార్థులు ర్యాలీ చేసి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు.



మరికల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

- నర్వ మండల కేంద్రంలో విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు.
- కోస్గి మండల తహసిల్దార్ కార్యాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముగ్గుల పోటీ, వ్యాసరచన పోటీలు చేపట్టారు.
- కృష్ణా మండలం ముడుమాల్‌లో విద్యార్థులు అధికారులు, వీధుల్లో ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు.
- మద్దూరు మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, పాతబస్టాండ్‌లో మనవహారం నిర్వహించారు.
- మాగనూర్‌లో ట్రయినీ కలెక్టర్ గరీమ నరుల మనవహారం నిర్వహించి, ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.
- ఊట్కూరు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.
- ధన్వాడ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.



కృష్ణా ముడుమాల్‌లో ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మద్దూరులో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ మహేష్‌గౌడ్



మరికల్‌లో సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్



కొత్తపల్లిలో ఓటరు దినోత్సవంపై మానవహారం



మాగనూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన కలెక్టర్



కలెక్టర్‌తో బహుమతులు అందుకుంటున్న కంసాన్‌పల్లి విద్యార్థులు

దామరగిద్ద: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కాంసాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన అనిల్‌కుమార్ వ్యాసరచనలో జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచాడు. కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల, కార్తిక్‌లు చిత్రలేఖనం జూనియర్ విభాగంలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యార్థులకు అభినందించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు హెచ్‌ఎం ప్రసాద్‌రావ్, పీటీ రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మరికల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని 9వ తరగతి ఆకాంక్ష చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనబర్చింది. జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించడంతో కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంది. అనంతరం హెచ్‌ఎం నాగరత్నమ్మతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ప్రశంసాపత్రం అందుకున్న మున్సిపల్ కమిషనర్

కోస్గి రూరల్: ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు చేర్చడంలో ప్రధానపాత్ర పోషించినందుకు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు శనివారం ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై శిక్షణ, జనన, మరణధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చినందుకు ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు.

బండలాగుడు పోటీలకు విరాళం



నర్వ: ఒంగోలు జాతి కాడెద్దుల బండలాగుడు పోటీలకు శనివారం బీఆర్‌ఎస్ మండల నాయకులు దండు అయ్యప్ప రూ.1,10,116 విరాళం అందించారు. ఫిబ్రవరి నెలలో రాంపూర్ శరణులింగ మహారాజ్ మఠంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. జాతర నిర్వాహకులు, ఆయనను అభినందించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాంపూర్ సుధాకర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగంపల్లిలో థియేటర్ వర్క్‌షాప్



మద్దూరు: బీజీఏ థియేటర్ అసోసియేషన్, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ప్రొడక్షన్ ఓరియెంటెడ్ ట్రెడిషనల్ ఫోక్ థియేటర్(బయిలాట) వర్క్‌షాప్‌ను మండలంలోని నాగంపల్లిలో నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ మొదటి దపా విజయవంతంగా శనివారంతో పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు కంట్రైనర్ కాడం బుగ్గప్ప తెలిపారు. రెండో దపా వర్క్‌షాపు మరో రెండు నెలలు కొనసాగుతుందని, బీజీఏ థియేటర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రచయిత, సింగర్ శ్రీకాంత్ తెలిపారు. వర్క్‌షాప్ అనంతరం విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకాన్ని ఇదే గ్రామంలో ఐదు రోజుల పాటు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

మక్తల్: మక్తల్ పట్టణంలో సాయిజ్యోతి ఉన్నత పాఠశాలలో జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నికాయిట్ క్రీడల్లో మక్తల్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంధ్య, రేణుక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జిజి మోల్ శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. అనంతరం జిల్లా టెన్నికాయిట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 26న హైదరాబాద్ అంబర్‌పేట్ మైదానంలో రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ఎంపిక కావడంతో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, పీఈటీ రాకేష్, జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేష్, ప్రిన్సిపాల్ జిజి మోల్ విద్యార్థులను అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జిజి మోల్

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

కోస్గి రూరల్: పథకాల పేరుతో దరఖాస్తులను మళ్లీ మళ్లీ తీసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్‌కుమార్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారినే కాకుండా అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేయాలన్నారు. కొడంగల్ డెవలప్ అథారిటీగా కాకుండా కాంగ్రెస్ పార్టీ డెవలప్ అథారిటీగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నరేష్, పద్మ, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

తహసీల్దార్‌ను సన్మానించిన నాయకులు



దామరగిద్ద: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ దయాకర్‌రెడ్డిని సన్మానించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ జయరాములు స్థానంలో బాధ్యతలు తీసుకోవడంతో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, భగవంతుగౌడ్, గోవింద్‌రెడ్డి, గోపాల్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



వడ్ల లక్ష్మయ్య (ఫైల్)

ఊట్కూరు: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణంరాజు వివరాల ప్రకారం.. మండలంలోని అవుసలోనిపల్లి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మయ్య (42) రెండు రోజుల క్రితం బట్టలు ఇస్త్రీ చేయించుకోవడానికి గ్రామంలోకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. రెండు రోజులుగా చుట్టుపక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం భార్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

మద్దూరు: 76వ గణతంత్ర దినోత్సవ వేడులకు మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓ తదితర కార్యాలయాల్లో రంగురంగుల కాగితాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వివిధ కళా రూపాల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు.



మద్దూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రంగుల కాగితాలతో తోరణాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా బడీడు పిల్లల సర్వే

దామరగిద్ద: మండలంలోని ఆయా క్లస్టర్ల పరిధిలో బడీడు పిల్లల గుర్తింపు సర్వేను ముమ్మరం చేశారు. శనివారం మండలంలోని అన్నసాగర్ గ్రామంలో సీఆర్‌పీ మహిపాల్ సర్వే నిర్వహించారు. బడీడుగల, మధ్యలో బడిమానిన విద్యార్థులను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. అన్నసాగర్‌లో విద్యశ్రీ, నవితలను దామరగిద్ద ఓపెన్ టెన్త్ తరగతుల్లో చేర్పించారు. ఇంటింటికి తిరిగి బడిమానిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ, ఓపెన్‌టెన్త్ కోఆర్డినేటర్ శంభులింగం, హెచ్‌ఎం హుస్సేనప్ప, ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.



ఓపెన్ టెన్త్ అడ్మిషన్‌ను అందజేస్తున్న కో ఆర్డినేటర్

అర్హులకే ప్రభుత్వ పథకాలు అందించాలి

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసాలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే కేటాయించేలా అధికారులు వ్యవహరిస్తున్నారని, నిజమైన అర్హులను గుర్తించి వారికి పథకాలను అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వంచర్ల గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగం ఉన్నవారికి కూడా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నారన్నారు. సమావేశంలో విజయభాస్కర్‌రెడ్డి, రాములు, నరేష్, హబీబ్, హన్మంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధన్వాడ చెరువులో చేపల వేట

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్యకారులు చేపలు పట్టి హైదరాబాద్ మార్కెట్‌కు ఎగుమతి చేసినట్లు ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిరటి నర్సింహులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో 5.7 టన్నుల చేపలు పడ్డాయని, ఆశించిన స్థాయిలో చేపలు పడలేదన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుతం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, రాములు, రాంచంద్రి తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో చేపలను తరలిస్తున్న సంఘం నాయకులు

సరాఫ్ కృష్ణకు నివాళి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బాలకేంద్రం ఏర్పాటు కోసం సరాఫ్ కృష్ణ ఎనలేని కృషి చేశారని డీవైఎస్ఓ శెట్టి వెంకటేష్, బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం బాలకేంద్రంలో లలిత కళానికేతన్ అధ్యక్షులు సరాఫ్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, వసంత్, రామకృష్ణ, కల్యాణి, జ్ఞానామృత పాల్గొన్నారు.



బాల కేంద్రంతో నివాళులర్పిస్తున్న అధికారులు

విద్యార్థులను అభినందించిన జీహెచ్‌ఎం



జాజాపూర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న జీహెచ్‌ఎం భారతి

నారాయణపేట రూరల్: జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన జాజాపూర్ పాఠశాల విద్యార్థులను శనివారం జీహెచ్‌ఎం భారతి అభినందించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉపన్యాస పోటీలో శివకుమార్ తృతీయ బహుమతి, వ్యాసరచన పోటీలో భారతి తృతీయ బహుమతి సాధించారు. వారిని జీహెచ్‌ఎం భారతి, డీఎస్ఓ భాను ప్రకాష్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, శ్రీదేవి, నిర్మల, శశిరేఖ, శిరీష పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నారాయణపేట: ప్రస్తుతం యాద్గీర్ రోడ్‌లో ప్రైవేట్ స్థలంలో ఉన్న ఆర్టీఏ కార్యాలయాన్ని మార్చేందుకు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏక్లాస్‌పూర్ లోకపల్లి లక్ష్మమ్మ దగ్గర ప్రభుత్వ భూములను ఆర్టీఏ మేఘా గాంధీ, ఆర్టీఏ జిల్లా మెంబర్ పోషల్ రాజేశ్‌కుమార్‌లు పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. త్వరలో ఆర్టీఏ కార్యాలయం నిర్మించి జిల్లా ప్రజలకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ఏక్లాస్‌పూర్‌లో ప్రభుత్వ భూములను పరిశీలించిన ఆర్టీఏ

కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి

దామరగిద్ద: ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకానికి కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు, ఇతర మార్పులు చేర్పులు చేసుకోదలిచిన పాత లబ్ధిదారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మణిచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రైతుబంధు పొందుతున్న రైతులు దరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదన్నారు. 2025 జనవరి వరకు కొత్తగా పట్టాదారు పాసు బుక్ పొందిన వారు, గతంలో లబ్ధిదారులుగా ఉండి తమ బ్యాంక్‌ఖాతా నెంబర్‌లు మార్చుకోవల్సిన వారు ఏఈఓలను సంప్రదించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసేవారు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను జతచేయాలన్నారు. ఎలాంటి సందేహాలున్న స్థానిక ఏఈఓలను సంప్రదించాలన్నారు.